# సగం సగం



## హితశ్రీ

బి.ఎ. సెకండ్ క్లాసులో పాసై, లైఫ్ హయ్యర్ పాసైనా గోపాల్‌కి సరైన ఉద్యోగం దొరకలేదు! మూడేళ్ల నుంచీ కాంపిటీటివ్ పరీక్షలు రాస్తూనే వున్నాడు. ఇంటర్‌వ్యూ దాకా వచ్చినా ఆ గట్టు ఎక్కటం ఆతనివల్ల కావటం లేదు. కొన్ని నెలలు ఏవో టెంపరరీ ఉద్యోగాలు ఒకటి రెండు చేశాడు. అవీ మేనమామ సుందరరామయ్య ప్రాపకం వల్ల సంపాదించినవే. ఆయన ఆడిటరు. పోనీ తన దగ్గిరే చేరి సి. ఏ. పరీక్ష రాయమన్నాడాయన. అది గోపాల్‌కి ఇష్టం లేదు. ఆ సబ్జక్టులు వేరు. వాటిలో అతనికి ఏమాత్రం అభిరుచి లేదు. అదీ కాక అదో మూడు నాలుగేళ్ళ చదువు. అంతకాలం ఉద్యోగం లేకుండా ఉండటం గోపాల్‌కి ఇష్టంలేదు.

ఏదో సంస్థలో ఓ టెంపరరీ ఉద్యోగం వుందంటే సిఫారసుకోసం గోపాల్ మేనమామ దగ్గరికి వెళ్లాడు.

"అంఎం ఉద్యోగంరా అది!" అన్నాడాయన లోపిపారేస్తున్నట్టు.

"ఏదో ఒకటి. ఊరికే ఉండటం కంటే నయంగా." అన్నాడు గోపాల్.

"పోనీ ఓ పని చెయ్యరాదూ?"

"ఏమిటి?" ఆసక్తిగా అడిగాడు గోపాల్.

"సరైన ఉద్యోగం రావటం లేదు కదా. ఎందుకీ పాకులాట. ఏదైనా బిజినెస్ చెయ్యి."

"పెట్టుబడో?"

"ఉన్న ఆ రెండెకరాలు అమ్మే సెయ్యి. ఓ యాభై వేలు వస్తాయి."

"పోతే మొత్తం పోతుంది!"

"ఎందుకు పోతుంది? పెట్టుబడి రిస్కు లేని వ్యాపారం చూద్దాం."

"బిజినెస్‌లో నాకు బొత్తిగా అనుభవం లేదు!"

"అదే వస్తుంది."

"నా కంత ధైర్యం లేదు మామయ్యా. తెలియని దాంట్లో వేలు పెడితే మొదటికే మోసం."

"ఇష్టం లేదనరాదూ?"

"అదికాదు. పోనీ ఎవరితోనైనా కలిసి బిజినెస్ చేస్తే?"

సుందరరామయ్య ఆలోచించాడు.

"మంచి ఆలోచనే. సీతారామమూర్తి అని ఒకాయన ఉన్నాడు. నాకు బాగా స్నేహితుడు. ఇతర రాష్ట్రాలకి బియ్యం ఎగుమతి చేస్తాడు. ఇంకా ఒకటి రెండు ఏజన్సీలేవో ఉన్నాయి. ఆయనతో మాట్లాడతాను. ఈ లోపల పెట్టుబడి సిద్ధం చేసుకో."

గోపాల్‌కి కూడా ఈ సలహా కొంచెం నచ్చింది. రాముని సలహా అడిగాడు.

రాము అంటే అతని క్లాస్‌మేట్. రూమ్ మేట్. బి.ఎ. చదువుతున్నప్పటినుంచీ ఇద్దరూ ఓరూమ్ తీసుకుని వుంటున్నారు. ఉద్యోగం ఉన్నా లేకపోయినా గోపాల్ గుంటూరులోనే ఉంటాడు. పల్లెటూళ్లో ఉంటే ఉద్యోగ ప్రయత్నాలు చెయ్యటం కష్టం. అందువల్ల గుంటూర్లోనే ఉండక తప్పదంటాడు అమ్మతో, అన్నతో. అసలు కారణం అదికాదు. క్లబ్బులో షటిల్ ఆడందే అతను వుండలేడు. రాము అతని పార్టనర్.

బిజినెస్ పెట్టే ఐడియా బాగుందన్నాడు రాము. గోపాల్ వెంటనే తన ఊరు వెళ్ళి అమ్మతో సంగతి చెప్పాడు! గోపాల్ తండ్రి అతను ఇంటర్ చదువుతున్నప్పుడే పోయాడు. ఆయన కరణీకం అన్నకి సంక్రమించింది. తమ పొలం భార్య తరుపున వచ్చిన పొలం కాక కొంత పొలం కౌలుకి తీసుకుని అతను వ్యవసాయం చేస్తాడు. మామిడి తోట వుంది. అతను గ్రాడ్యుయేటు కావటం వల్ల చదువు చెప్తాడు కూడా. పరపతి ఉంది. అందువల్ల జననీ, జన్మభూమి అనుకుని ఆ పల్లెటూల్లోనే ఉంటున్నాడు మామయ్య సలహా అని గోపాల్ అనటం వల్ల వారిద్దరూ గట్టిగా ఏమీ అనలేక అతనివంతు పొలం రెండెకరాలు అమ్మటానికి ఒప్పుకొన్నారు.

పొలం అమ్మిన డబ్బు యాభై వేలూ తీసుకుని మామయ్య దగ్గరకి వచ్చాడు గోపాల్. ఆయన అడివంకే తన స్నేహి

తుడు సీతారామ్మూర్తితో మాట్లాడి భాగస్వామ్యానికి ఒప్పించాడు. గోపాల్ రాగానే అతన్ని సీతారామ్మూర్తి దగ్గిరికి తీసుకువెళ్లి పరిచయం చేశాడు.

"నీది పావలా వాటా కాగితాలేం వుండవు. నోటిమాటే." అన్నాడు సీతారామ్మూర్తి గోపాల్‌వైపు చూస్తూ.

"అలాగేనండి." అన్నాడు గోపాల్.

"అదేమిటయ్యా, నువ్వేం బిజినెస్ చేస్తావు? ఒప్పందం కాగితం మీద రాసుకోరా యేమిటి?" అన్నాడు సీతారామ్మూర్తి నవ్వుతూ.

గోపాల్ కొంచెం తెల్లబోయాడు.

"మీ ఇష్టం."

"నా ఇష్టమేమిటి? భాగస్వామ్యం అన్న తరువాత ఇద్దరి ఇష్టప్రకారం జరగాలి."

"మీ ఇష్టమే నా ఇష్టం" అన్నాడు గోపాల్ ఆయన మాటతీరుని మెచ్చుకుంటూ!

"ఖాతాలో రాయవయ్యా, చాలు" అన్నాడు చనువుగా సుందరరామయ్య.

"ఓహో! ఆడిటర్ బుద్ధి పోనిచ్చావు కాదే. ఖాతాలో రాయాలిట! ఖాతాలో రాయక ఇంకెక్కడ రాస్తారు? ఆడిట్ నోట్‌బుక్‌లో రాస్తారా?" అన్నాడు సీతారామ్మూర్తి నవ్వుతూ.

"ఎక్కడ రాసినా ఆడిటర్ జేబులోకి ఏమీ రాదయ్యా" అన్నాడు సుందరరామయ్య.

"అదా నీ బాధ! సరేగాని అబ్బాయ్, పావలా వాటా గదా అని పావలావంతు పని మాత్రమే చేస్తానంటావేమో_"

"లేదండి. చాలా శ్రద్ధగా పని చేస్తాను. మీరు కొంచెం గైడెన్స్ ఇస్తే చాలు."

"గైడెన్స్‌కి పెద్ద పనంటూ ఏంలేదు. అంతా ఉత్తరాల మీద వ్యవహారమే. ఫోన్‌కాల్స్ మాత్రం ఎక్కువగా వస్తుంటాయి. ఆన్సర్ చెయ్యాలి. అసలందు కోసమే ఆ అమ్మాయిని అపాయింట్ చేసింది_సుందరి అనీ, ఆఫీసులో టైప్ చేస్తోందే ఆ అమ్మాయి చేసేపని అదే. ఇంక ఆ అమ్మాయి అవసరం లేదు. ఫస్ట్‌నించి తీసేద్దాం. మేనేజిమెంట్ అలవెన్స్‌కింద_జీతంకాదు_అలవెన్సు నెలకి 500 రూపాయలు తీసుకో. బయటిపని నేను చూసుకొంటాను." అన్నాడు సీతారామ్మూర్తి.

లాభంకాక అయిదొందలు నెలనెలా వస్తుందనేసరికి గోపాల్ ఎగిరి గంతేశాడు.

"బాగుందోయ్" అన్నాడు సుందరరామయ్య సంతోషంగా.

"ఆడిట్ అబ్జెక్షన్స్ ఏం లేవన్నమాట."

సీతారామ్మూర్తి నవ్వుతూ అని అందరికీ టాయ్‌చేత స్వీట్స్, కూల్‌డ్రింక్స్ తెప్పించాడు. టైపిస్టు సుందరిని కూడా పార్టీకిపిలిచాడు. ఆమెకి సుందరరామయ్య ఆ సంస్థ ఆడిటర్‌గా అంతకి ముందే తెలుసు.

"నమస్కారమండీ" అందామె సుందరరామయ్యని ఉద్దేశించి.

"నమస్కారం. కులాసాగా ఉన్నావామ్మా?" అన్నాడాయన.

ఆమె తలూపింది.

"ఈయన గోపాల్‌గారు. సుందరరామయ్యగారి మేనల్లుడు." అన్నాడు సీతారామ్మూర్తి

ఆమె నమస్కారం చేసింది. అతనూ నమస్కారం చేశాడు.

"గోపాల్‌గారు మన బిజినెస్‌లో పార్టనర్‌గా చేరారు. ఇంకనుంచీ ఆయనే ఆఫీసు పని చూస్తుంటారు."

ఆమె అతనికి స్వాగతం చెబుతున్నట్టుగా అతనివైపు చిరునవ్వుతో చూసింది. అతనూ మందహాసం చేశాడు.

మర్నాటి నుంచీ గోపాల్ ఆఫీస్ చార్జి తీసుకున్నాడు. చిల్లర వ్యవహారాలు లేవు కనుక ఆఫీసుపని చాలా తక్కువే. ఎక్కువగా ఫోన్‌కాల్స్‌మీదే వ్యవహారాలు జరుగుతాయి. గోపాల్ వచ్చినప్పటినుంచీ సీతారామ్మూర్తి ఆఫీసుకి రావటం చాలావరకు తగ్గించాడు. వచ్చినా కాసేపు కూర్చుని వెళ్లిపోతాడు. ఆ కాసేపూ గోపాల్‌తో బాతాఖానీ వేస్తాడు. సీతారామ్మూర్తి మనుషుల మనస్తత్వాన్ని అంచనా వెయ్యటంలో మహా ప్రతిభాశాలి. చిన్న విషయాల్లో గోపాల్‌ని పూర్తిగా నమ్మొచ్చని కనిపెట్టాడు. అంతేకాదు, అతడు చురుకైనవాడు. పని పూర్తిగా అకళింపు చేసుకొన్నా తనమీది గౌరవం కొద్దో ఏమో తన సలహా అడక్కుండా మాత్రం ఏం చెయ్యడు.

"నువ్వు చాలా చురుకైన వాడివోయ్" అన్నాడు సీతారామ్మూర్తి ఓసారి.

"అంతా మీ ట్రెయినింగేనండి."

"నీలాంటి పార్టనర్ దొరకటం నా అదృష్టం."

"మీ అండ దొరకటం నా గుడ్‌లక్ సార్."

"నాకూ వయసు మీరుతోంది కదా. సరైన పార్టనర్ దొరక్కపోతే బిజినెస్ మానేద్దామని కూడా అనుకొన్నాను. నాక్కావలసింది కాపిటల్ కాదు, బిజినెస్ నడిపే శక్తిగల మంచి పార్టనర్_చూస్తూ వుండు, ముందుముందు నువ్వే ముప్పావలా వాటాదారుని, నేను పావలా వాటాదారుని అవుతాం."

"పావలా, ముప్పావలా అనేది నాకు ముఖ్యం కాదండి మీ వంటివారి కంపెనీలో పనిచెయ్యటమే నాకు కావలసింది," అన్నాడు.

"నీదే ఈ కంపెని ఎప్పటికయినా నీకే అవుతుందోయ్."

"అదేమిటండీ?" అన్నాడు గోపాల్ కొంచెం భయంగా.


"అవును. మా ఇద్దరి అబ్బాయిలకి దీనిమీద అభిరుచి లేదు. ఒకడు ఢిల్లీలో

ఉద్యోగం చేస్తున్నాడు, ఇంకోడు అమెరికాలో. నా కెందుకీ బాదరబందీ?" అంటూ సీతారామ్మూర్తి గోపాల్ ముఖంలోకి చూశాడు. ఈ మాటలకి అతని వదనం వికసిస్తుందనుకొన్నాడు. కాని అతను అప్రసన్నంగా ఉండటం చూసి ఆశ్చర్యపోయాడు.

"నే నొక్కడినే అయితే నే నీ బిజినెస్ చెయ్యనండీ" అన్నాడు గోపాల్.

"అదేం?"

"ఏమో!"



సీతారామ్మూర్తి అతనివైపు వింతగా చూశాడు. కాని ఏమీ మాట్లాడలేదు.

ఆఫీసులో ఎదురెదురుగా కూర్చున్నా టైపిస్టు సుందరితో గోపాల్ కొంచెం ముభావంగానే ఉన్నాడు. ముక్తసరిగా ఆఫీసు విషయాలేమైనా ఉంటే మాట్లాడటమే. పనివుంటే చూసుకోటం, లేకపోతే ఏదైనా పత్రికో, పుస్తకమో చదువుకోటం. అంతే. కేవలం మేనేజరైతే ఏమోగాని పార్ట్‌నర్‌కూడా కావటం వల్ల సుందరికూడా అతనితో చనువుగా మాట్లాడటానికి జంకేది.

సాయంకాలం నాలుగు కాగానే గోపాల్ షటిల్ ఆడటానికి ఆఫీసునించే వెళ్ళిపోతాడు. ఓరోజు నాలుగు కాగానే లేచి బాట్ అందుకొని వెళ్ళబోతుంటే సుందరి అతని టేబిల్ దగ్గిరికి వచ్చింది.

"ఏమైనా పేపర్స్ ఉన్నాయా?" అన్నాడు.

"మీతో ఓ విషయం మాట్లాడాలండీ." అంది సుందరి నెమ్మదిగా.

"ఓ యెస్" అన్నాడు.

"ఎల్లుండి ఫస్ట్."

"అవును. జీతం అవసరమా? ఫస్ట్ దాకా ఎందుకు? ఇప్పుడే తీసుకోండి."

"జీతంకాదు. ఎల్లుండినించీ టైపిస్ట్ అవసరం లేదన్నారు సీతారామ్మూర్తి గారు."

"ఎందుకు అవసరంలేదు?"

"మీకు టైప్ చెయ్యటం వచ్చుట."

"వస్తే?"

"మీరే చూసుకుంటారుట."

"నేనా?_అఁ_అఁ." గోపాల్‌కి అకస్మాత్తుగా జ్ఞప్తికి వచ్చింది. తను నెల మొదటి వారంలో చేరాడు. ఫస్ట్‌నించీ టైపిస్ట్‌ని మానిపిద్దామన్నాడు కదా!

"అందువల్ల వేరే టైపిస్ట్ అవసరం లేదని చెప్పారు."

"ఎప్పుడు చెప్పారు?"

"నిన్న సాయంకాలం నాలుగింటికి మీరు వెళ్ళింతరువాత ఆఫీసుకి వచ్చి చెప్పారు."

ముందుగా చెబుదామనుకుని మర్చిపోయానన్నారు."

"అరె మీకు ఓ నెల ముందు చెప్పాలి కదా!"

"ఆ విషయం కాదండి. మా కుటుంబ పరిస్థితులవల్ల నేనేదో ఉద్యోగం చెయ్యటం అవసరం. పోనీ పార్టుటైంగా ఇచ్చినా చాలండి లేకపోతే జీతం

పార్టుటైం వర్క్‌కి ఇచ్చినా వర్కింగ్ అవర్స్ అంతా ఉంటాను."

గోపాల్‌కి గుండెలో ఏదో గుచ్చుకున్నట్టయింది. తను రావడంవల్ల ఆమెకి ఉద్యోగం పోతోంది.

"సీతారామ్మూర్తిగారితో నేను మాట్లాడతాను. పార్ట్‌టైం టైపిస్ట్‌గా ఉంటానని ఆయనతో చెప్పారా?"

"లేదండి, అప్పుడు నాకు తోచలేదు."

"నేను మాట్లాడతాన్లెండి."

"మీరు సహాయం చేస్తే చాలా కృతజ్ఞురాలిని."

"దానికేం! ఫరవాలేదండి. నేను ఆయనకి గట్టిగా చెబుతాన్లెండి."

ఆమె ముఖం వికసించింది.

ఆ రాత్రి సీతారామ్మూర్తి ఇంటికివెళ్ళి ఆయనతో టైపిస్ట్ విషయం ఎత్తాడు గోపాల్.

"ఆమెకి ఉద్యోగం అవసరం కావచ్చు. కాని ఉద్యోగం ఇక్కడ ఉంటే కద." అన్నాడాయన.

"అది కాదండి. నేను వచ్చి ఆమెకి ఉద్యోగభంగం కలిగించానని బాధగా ఉంది. నావల్ల ఒకరికి అపకారం జరిగితే భరించలేను సార్. పోనీ పార్టుటైంగా ఇద్దాం." అన్నాడు గోపాల్ ఇంచుమించు ప్రాధేయపడుతున్నట్టుగా.

సీతారామ్మూర్తి అతని కళ్లలోకి చూసి నవ్వాడు.

"సరే, నీ ఇష్టం" అన్నాడు.

గోపాల్‌కి ఎంతో ఉత్సాహం కలిగింది.

"థాంక్స్ సార్. మెనీ థాంక్స్".

"ఎందుకోయ్ అన్ని థాంక్స్. నువ్వూ పార్టనర్‌వే. మర్చిపోకు." నవ్వాడాయన మళ్లీ.

"తమిళనాడు షిప్‌మెంట్ చాలా లాభసాటి బేరానికి సెటిల్ చేశామండి." అన్నాడు మాట తప్పిస్తూ, ముఖంలో సంతోషం తాండవిస్తుండగా.

"నువ్వు సమర్థుడవని నాకు తెలుసు. కర్ణాటక నించికూడా మంచి ఆర్డర్ వచ్చేట్టుందోయ్." అంటూ సీతారామ్మూర్తి కూల్‌డ్రింక్స్ తెప్పించాడు.

మర్నాడు గోపాల్ ఆఫీస్‌కి కొంచెం పెందరాళే వచ్చాడు. సుందరికి ఆ మంచి వార్త చెప్పాలని అతని మనసు ఉవ్విళ్లూరింది. ఎప్పుడు సరిగా టైంకి వచ్చే సుందరి ఆ రోజు పది, పదిన్నర, పదకొండయినా రాలేదు.

గోపాల్‌కి ఏం తోచటంలేదు. ఫైల్స్ చూస్తూ మధ్యమధ్యన తలెత్తి సుందరి సీటువైపు ప్రయత్నంగా, అప్రయత్నంగా కూడా చూడసాగాడు. ఫైల్స్ పక్కకినెట్టి ఏదో పత్రిక తీసుకున్నాడు. చదవలేకపోయాడు! అక్కడ సుందరి లేదంటే ఏదో వింత అశాంతి కలగసాగింది. ఆమెతో ఎప్పుడూ ఎక్కువ చనువుగా మాట్లాడి ఎరుగడు. ఎదురుగుండా ఉన్నా చాలా తక్కువసార్లు ఆమెవైపు చూశాడు. పని వున్నప్పుడు కూడా తలవంచుకునో, ఎటో చూస్తూనో ఆమెని ఉద్దేశించి మాట్లాడతాడు. మరి ఇప్పుడీ స్థితి ఏమిటి? మొట్టమొదటిసారిగా అతను సుందరిని గురించి, ఆమె రూపురేఖల్ని గురించీ, ఆమె వైఖరి గురించీ ఆలోచించసాగాడు. ఆమె పని పట్ల శ్రద్ధాసక్తులు కనబరుస్తుంది. అనవసరంగా తన దృష్టిలోకి రాదు. మాటలు పెంచదు. తనూ అంతే. బహుశా ఆమెకి మంచివార్త చెప్పాలన్న ఉత్సాహం నీరుకారిపోయుండటం వల్ల తనకి అలా అశాంతిగా ఉంది. లేక ఇంకేదైనా కారణం వుందా?

ఫోన్ మోగింది. సుందరి అయి వుంటుందని చప్పున రిసీవర్ అందుకున్నాడు. ఏదో బిజినెస్‌కాల్. లారీ రెసీట్ వివరాలు అడుగుతున్నారు. నోటి దగ్గిరనుంచి రిసీవర్ తీసి "సుందరి గారూ__" అని నాలిక కరుచుకున్నాడు.

తనే ఫైల్ చూసి వివరాలు చెప్పి ఫోన్ పెట్టేశాడు.

ఆ రోజంతా సుందరి రానేలేదు. మర్నాడు సరిగా టైంకే వచ్చింది. ఆమెని చూడగానే అతని ముఖం విప్పారింది.

సుందరి సీట్ దగ్గిరికి పోకుండా అతని టేబిల్ దగ్గిరికి వచ్చి విష్‌చేసింది.

"సారీ సార్! నిన్న రాలేకపోయాను" అంది.

"ఒంట్లో బాగుండలేదా?"

"బాగానే వుంది. ఎక్కడో టైపిస్టు పోస్టు ఉందంటే దానికోసం ప్రయత్నం చెయ్యటంతో రోజు గడిచిపోయింది. అదృష్టవశాత్తూ ప్రయత్నం ఫలించింది."

"అలాగా!" అన్నాడు గోపాల్ హీన స్వరంతో.

"ఆర్డర్ కూడా ఇచ్చారు. మీరు రిలీవ్ చేస్తే వెళ్ళి జాయినవుతాను."

"జీతం ఎంత?"

"ఇక్కడ ఇచ్చే అంతే, అయిదొందలు."

"మూర్తిగారు పార్ట్‌టైం వర్క్ ఇవ్వటానికి ఒప్పుకున్నారు. అంటే అందులో సగం వస్తుంది."

"థాంక్స్. కాని అక్కడ__"

"అవును మిగతాది నా జీతంలోంచి ఇస్తాను."

"మీ జీతంలోంచా?" ఆమె చప్పున అతని కళ్లలోకి చూసింది.

"అవును."

"ఎందుకు?"

"లేకపోతే మీ పనిలో సగం నేను చెయ్యాలిగా."

ఆమె నవ్వింది.

"బాగుంది."

"మీ కిష్టమైతే ఇక్కడే ఉండొచ్చు." అన్నాడు, అందులో అభ్యర్థన ఆమె గమనించింది. అతని జీతంలో సగం తనకిచ్చి తన ఉద్యోగం నిలపటమెందుకో ఆమెకి అర్థంకాలేదు. నిజంగా

పనికి బద్ధకించా? తనకి సహాయం చెయ్యాలనా? లేక—

"ఏమంటారు?"

"మీకు ఇబ్బంది అవుతుందేమో!"

"ఇబ్బందేం లేదు. నా ఒక్కడికీ అది చాలు. ఏదైనా అవసరమైతే మారూం మేట్ రాము సర్దుతాడు. వాడు కాస్త ఉన్నవాడే."

అమాయకతో, సాధారణతో! అతనలా స్పష్టంగా తన విషయం చెబుతుంటే సుందరికి అతని మీద చాలా సదభిప్రాయం కలిగింది.

"థాంక్సండీ," ఆమె తన సీటు దగ్గిరికి వెళ్లింది.

గోపాల్‌కి పోయిన ఉల్లాసం తిరిగి వచ్చింది.

"మీరు నిన్న రాకపోతే ఆఫీసంతా చిన్నబోయిందనుకోండి." అన్నాడు గోపాల్.

ఎప్పుడూలేని ఈ అదిరింపుకి సుందరి తెల్లబోయి అతనివైపు చూసింది. మర్యాద కోసం చిన్నగా నవ్వింది.

"మనం బజార్లో నడుస్తుంటా మనుకోండి. ఎక్కడో ఓ చోట ఏదో వెలితిగా కనిపిస్తుంది, వెంటనే తట్టదు. కొంచెం ఆలోచిస్తే అక్కడ ఉండాలిసిన ఏ చెట్టో కొట్టేసినట్టు, లేకపోతే ఏ గోడో పడగొట్టినట్టు తెలుస్తుంది. అలాగే నిన్న సీట్లో మీరు లేకపోతే—"

సుందరి మరింత తెల్లబోయింది.

"ఈ ఆఫీసులో నైపిస్టుకూడా ఏ చెట్టో, గోడోలాంటి దంటారు." అప్రయత్నంగా అనేసింది కొంచెం దురుసుగా.

"ఎబ్బెబ్బే, అదికాదు సుందరి గారూ" అని ఏదో చెప్పాననుకోండి. జవాబు లేదు, మూడు నాలుగుసార్లు అలా చెప్పటం జరిగిందనుకోండి, ఏమిటా జవాబు లేదని ఆలోచిస్తే సీట్లో మీరు లేరని తెలుస్తుంది కదా—అలా జరిగింది."

సుందరి తలెత్తి అతనివైపు దీక్షగా చూసింది. ఆమె చూస్తున్నదని అతను ఫైలు చూస్తూ మాట్లాడుతున్నాడు. ఎప్పుడో తప్ప చాలాసార్లు తనతో అలా ఎక్కడో చూస్తూనే మాట్లాడుతాడు. అది నిర్లక్ష్యం అనుకుంది కాని అతని పద్ధతే అంత. తన ఉనికిని గురించిన చేతన అతనికి అంతగా ఉందని తను ఎప్పుడూ అనుకోలేదు.

"నేను జాయిన్ కావటంలేదని వాళ్లకి ఫోన్ చేస్తానండీ." అంది సుందరి.

"చెయ్యండి. మీ రిక్కడ వర్కు చెయ్యకపోతే నేనూ చెయ్యలేను. ఈ ఆఫీసు మహా సామ్రాజ్యాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలటం నావల్ల కాదని నిన్ననే తేలిపోయింది." అన్నాడు గోపాల్.

సుందరికి ఆశ్చర్యంమీద ఆశ్చర్యం ఎదురవుతున్నది. ఒక్క క్షణం స్తబ్ధురాలైంది. ఏమిటి అతని ఉద్దేశం? ఏదో అనుబంధం ఉన్నట్లు మాట్లాడుతున్నాడు. ఇంతకిముందు ఆఫీసు విషయాలు తప్ప ఇంకేమీ మాట్లాడి ఎరగడు.

"ఫోన్లో అయితే ఆ మేనేజింగ్ డైరెక్టరు యక్షప్రశ్న లడుగుతాడేమో. పోనీ, లెటర్ రాస్తాలేండి" అని ఓ లెటర్ రాసి "ఈ డ్రాఫ్ట్ సరిగా ఉందేమో చూస్తారా?" అంది సుందరి. అందులో అరడజను తప్పులు దిద్ది ఇచ్చాడు గోపాల్. అది చూసుకుని "నా ఇంగ్లీషులో ఇన్ని తప్పులున్నాయా?" అందామె.

"అంటే ఏమిటి మీ అభిప్రాయం? నేను ఇంగ్లీషులో స్కూల్‌ఫస్టు, కాలేజీ ఫస్టండోయ్." అన్నాడతను.

"అలాగా?"

"సంస్కృతంలో కూడా"

"మీకు సంస్కృతం కూడా వచ్చా?"

"ఏమనుకున్నారు మరి?" అన్నాడు కొంచెం గర్వంగా.

"ఐ. ఏ. ఎస్. కి కూర్చోక

(యువ 1961 జూన్ సంచిక నుండి)



"ఊహుఁ! భయమేమీలేదు. పడనులేండి. పైన చీరె మా నాన్నే పట్టుకున్నాడు."

పోయారా?"

"కూర్చునేవాణ్ణే. కంపెనీ దొరక్క మానేశాను."

"కంపెనీ ఏమిటి? ఎవరి చదువు వాళ్లదేగా!"

"అవుననుకోండి. ఆ మధ్య బాంక్ పి. ఓ. సెలక్షన్‌కి ఇంటర్వ్యూ వచ్చింది. దానికి వెళ్లటం పడలేదు."

"ఏం?"

"రామూ కూడా రావాలి. తీరా ప్రయాణంరోజు వాడికి జ్వరం తగిలింది, మానేశాను."

సుందరి కొంచెం వింతగా చూసింది అతనివైపు. అతను చిత్రమైన మనిషిలా కనిపించసాగాడు ఆమెకి.

సాయంకాలం మూడున్నరకి రాము వచ్చాడు. అతనిని సుందరికి పరిచయం చేశాడు గోపాల్.

"ఇవాళ షటిల్‌కాక్ బాట్మింటన్ టోర్నమెంట్ ఉంది. డబుల్స్ ఫైనల్. నేనూ రామూ పార్ట్‌నర్స్. మీరు కూడా

రండి." అన్నాడు గోపాల్ సుందరితో.

"గోపాల్ మంచి ప్లేయరండీ. మీరు వీడి ఆట చూసితీరాలి" అన్నాడు రాము.

"చాల్లేరా, నీ ముందు నేనూ ఓ ప్లేయర్నే! రాము గొప్ప ఛాంపియన్ అండి." అన్నాడు గోపాల్.

వాళ్ళతోపాటు సుందరికూడా టోర్నమెంట్ చూడటానికి బయలుదేరింది. గోపాల్ ప్రజ్ఞకి ఆశ్చర్యపోయింది. బంతిని స్మాష్ చెయ్యడంలో అతనికతనే సాటి అనుకొంది. రాము ఆట కూడా ప్రశంసాపాత్రంగా నే కనిపించిందామెకి. పోటీలో వాళ్ళే గెలిచారు. ఇద్దరికీ తన అభినందనలు తెలియచేసింది సుందరి. మర్నాడు సింగిల్స్ పోటీలో రాము గెలుపొందాడు. గోపాల్ సింగిల్స్‌లో ఆడలేదు.

"మీరు సింగిల్స్‌లో ఎందుకు ఆడలేదు?" అడిగింది సుందరి.

"ప్రాక్టీస్ చెయ్యలేదు."

"ఈసారి ప్రాక్టీస్‌చేసి టోర్నమెంట్‌లో ఆడండి. మీరే ఛాంపియన్‌షిప్ గెలుస్తారు" అందామె ప్రోత్సాహమిస్తూ.

"నేను డబుల్స్ తప్ప ఆడలేనండి. అసలు సింగిల్స్ ఆటలో నాకు అభిరుచి లేదు" అన్నాడు గోపాల్.

"అలాకాదు. మీ ప్రతిభ మీకు తెలియదు. తప్పక ప్రాక్టీస్ చెయ్యండి."

"చూద్దాం." అన్నాడతను.

"చూద్దాం ఏమిట్రా, నే నెన్నిసార్లో చెప్పాను. ఈసారి నువ్వు సింగిల్స్ ప్రాక్టీస్ చెయ్యాల్సిందే. ఛాంపియన్‌షిప్ గెలవాల్సిందే," అన్నాడు రాము సుందరిని బలపరుస్తూ.

గోపాల్ సమాధానంగా ఓ చిరునవ్వు నవ్వాడు.




"డబుల్స్‌లో ఓడిపోతే తప్పు నీమీద తోసెయ్యొచ్చు. సింగిల్స్‌లో అలా వీల్లేదుగా" అన్నాడు

అంతా నవ్వారు. సుందరి మనోఫలకంలో వాళ్ల డబుల్స్ ఆట మెదిలింది, గోపాల్ తన తప్పుల్ని రాముమీదికి నెట్టకపోగా అతని తప్పుల్ని తనే స్వీకరించేవాడు. అతను స్మాష్‌చేస్తే రాముని కౌగలించుకుని పొంగిపోయేవాడు. అంత గొప్పవాడు సింగిల్స్‌లో ఆడకపోవటమేమిటనుకొంది సుందరి.

రోజులు గడిచిపోతున్నాయి. సీతారామ్మూర్తి పూర్వంలా ఆఫీసుకి సరిగా రావటం లేదు. ఆయనకి బ్లడ్ ప్రెషర్ ఎక్కువై డాక్టర్ల సలహామీద ఇంటి దగ్గిర రెస్టు తీసుకుంటున్నాడు. వ్యవహారాలు అన్నీ గోపాల్ ఒక్కడే చూడవలసి వచ్చింది. అయినా తరుచు మూర్తి ఇంటికి వెళ్ళి ఆయన సలహా మీదే పనులు జరుపుతున్నాడు. ఇద్దరూ కాసేపు బిజినెస్ వ్యవహారాలు మాట్లాడి ఆ తర్వాత సంతోషంగా తాము సాధించిన విజయాలు నెమరువేసుకొంటారు.

పూర్వంలా ముక్తసరిగా కాకుండా ఇప్పుడు సుందరితో కాస్త పిచ్చాపాటీ మాట్లాడతాడు గోపాల్.

ఓరోజు సాయంకాలం సుందరి ఇంటికి వెళ్లబోతుంటే "ఏమండీ, రేపట్నించి నాలుగురోజులు ఇంటిదగ్గర భోజనం చేసిరాకండి. కారియర్ వస్తుంది, ఇక్కడే భోంచేద్దాం." అన్నాడు గోపాల్.

"ఎందుకు?" అంది సుందరి.

"ఏంలేదు, రూంలో నేనూ రామూ కలిపి భోంచేస్తాం గదా. రాత్రి వాడు వాళ్ళ ఊరెళ్లాడు. నాలుగు రోజులదాకా రాడు. వేస్టయిపోతుంది గదా. అందుకని__"

"వేస్టవుతుందనా! మరి ఇవాళ పొద్దున వేస్టుకాకుండా ఏంచేశారు?" అంది సుందరి కొంచెం వేళాకోళంగా.

"ఇవాళ అంతా వేస్టేనండి. ఏమిటో వాడు లేకపోతే తినబుద్ధి కాలేదు. అసలు కారియర్ తెరవలేదు." అన్నాడు గోపాల్.

ఉలిక్కిపడి అతనివైపు చూసింది సుందరి. అతని ముఖం నీరసంగా కనిపించింది. ఏమిటి ఇతని పిచ్చి?

"ఏమంటారు?"

"అలాగే." అందామె. కాని గొంతు పెగల్లేదని తెలిసి తల ఊపింది.

సీతారామ్మూర్తికి హార్టుఎటాక్ వచ్చింది. గోపాల్ దిగాలుపడిపోయాడు. సమయానికి సరైన ట్రీట్‌మెంట్ అందటంవల్ల ఆయన కోలుకున్నాడు. ఓరోజు గోపాల్ చూడటానికి వెడితే దగ్గిరికి పిలిచాడు.

"గోపాల్ ఓసారి చెప్పాను. ఎప్పటికో ఈ బిజినెస్ నీదే అవుతుందని ఆ సమయం వచ్చింది."

"అలా అనకండి." అన్నాడు గోపాల్ కళ్ళు చెమ్మగిల్లి.

"నా పెట్టుబడిని అప్పుగా మార్చి వాయిదాలమీద తీర్చు. దానికి ట్రస్ట్ ఏర్పాటు చేస్తాను! నువ్వే మేనేజింగ్ ట్రస్టీవి. ధర్మకార్యాలకి వినియోగించు. మా అబ్బాయిలకి వేరే బోలెడంత ఆస్తి వుంది. వాళ్ళకి ఇందువల్ల పోయేదిలేదు. నువ్వు నా పార్టనర్‌గా దొరకటం నిజంగా నా అదృష్టం," అన్నాడు సీతారామ్మూర్తి గోపాల్ తలమీద చెయ్యివేసి. గోపాల్ కళ్ళు వర్షించాయి. ఏమనటానికి నోరు పెగల్లేదు.

సీతారామ్మూర్తి మంచాన పడటం వల్ల గోపాల్ ఉత్సాహం సగం తగ్గింది. బిజినెస్‌లో అభిరుచి సన్నగిల్ల సాగింది.

రాము సుందరిల బలవంతం మీద ఈసారి టోర్నమెంట్‌లో గోపాల్ సింగిల్స్‌లో కూడా ఆడాడు. అయితే సింగిల్స్ పోటీ మొదటి రౌండ్‌లో ఎలాగో చావుతప్పి కన్నులొట్టపోయినా రెండోరౌండ్‌లో చిత్తుగా ఓడిపోయాడు. అతని ఆట చూస్తే అసలు అతనికి బాట్ పట్టుకోటం చేతనవునా అనే సందేహం కలగక మానదు. అడవిలో తిరుగుతున్నట్టుగా కోర్టులో తిరగసాగాడు. స్మాష్‌లు నెట్టుకి లేక ఔట్‌సైడ్‌కి పోయేవి. రాము ఆశ్చర్యపోయాడు. అతనికేదో జరిగిందనుకొన్నాడు. డబుల్స్‌లో మాత్రం రాముతో కలిసి వీరవిహారంచేసి ట్రోఫీ గెలుచుకొన్నాడు. అది సుందరికి గొప్పగా చూపించాడు, ఆఫీస్ టేబిల్‌మీద పెట్టి.

"సింగిల్స్‌లో ఈ ఆట అంతా ఏమయింది?" అంది సుందరి.

"నిద్రపోయింది. నేను ముందే చెప్పాగా" అన్నాడు గోపాల్.

మరో మూడునెలలు గడిచాయి. సీతారామ్మూర్తి ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉండటంతో అతను పూర్తిగా బిజినెస్ నించి విరమించుకొన్నాడు. గోపాల్‌ని పిలిచి ఆ విషయం చెప్పేశాడు. ఆ మర్నాడు ఏదో ఉద్యోగం వచ్చి రాము హైద్రాబాద్ వెళ్ళిపోయాడు.

"మీరు ఇహ ఇంకో ఉద్యోగం, చూసుకోవాలేమో." సుందరి ఆఫీసుకి వచ్చి సీట్లో ఇంకా కూర్చోకుండానే అన్నాడు గోపాల్ విచారంగా.

"పార్టనర్ లేకుండా మీరు బిజినెస్ చెయ్యరు. భయం. అంతేగా! పోనీ నన్ను పార్టనర్‌గా తీసుకోండి, పెట్టుబడి మీది శ్రమ నాది."

"ఆహా — షటిల్ కూడా నేర్చుకుంటారా!" చిరుకోపంతో అన్నాడు.

"నేర్పండి." స్నిగ్ధంగా నవ్విందామె

"అన్ని సమస్యలూ అంత సులభంగా పరిష్కారం కావు సుందరిగారూ." అన్నాడు గోపాల్ బాధగా.

"నాకు తెలుసండీ." అంది సుందరి మృదువుగా, ఆర్ద్రంగా.

